క్లుప్తంగా

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరలో ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలని సమ్మక్క ఆలయ ప్రధాన పూజారి సిద్ద బోయిన అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం గద్దెల ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ జాతరలో యాటను, కోళ్లను హలాల్ చేసి అమ్మవార్లకు మొక్కుబడిగా చెల్లించడం మంచిది కాదన్నారు. జాతరలో హలాల్ చేయడం నిషేధమన్నారు. జాతరకు వచ్చే భక్తులు సంస్కృతి, సంప్రదాయాలను, పూజారుల మనోభావాలను గౌరవించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మంగపేట: మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన ముస్కె గ్రేస్మంత్ అనే బాలుడు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ప్రజాసేవ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ.5000 నగదును అందచేశారు. పరామర్శించిన వారిలో ట్రస్టు చైర్మన్ గుడివాడ శ్రీహరి, గౌరవ అధ్యక్ష, సలహాదారులు కుడుముల లక్ష్మీనారాయణ, చిట్టిమళ్ళ సమ్మయ్య, గుండేటి రాజుయాదవ్, కరివర్ధన్, తిరుపతి, సాంబయ్య, వేణు, రమేష్, సందీప్, కిషోర్, నాగేందర్, రాంబాబు తదితరులు ఉన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

కాటారం: గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశం కోసం నిర్వహించే సీఓఈ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) పరీక్ష నేడు (ఆదివారం) మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శైలజారాణి, డిపార్టుమెంటల్ ఆఫీసర్ జే.కే.బుచ్చయ్య తెలిపారు. పరీక్షా కేంద్రంలో 100 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకొని గంట ముందే పరీక్షా కేంద్రానికి రావాలని సూచించారు.

డీపీఆర్ఓకు సన్మానం



భూపాలపల్లి రూరల్: డీపీఆర్‌ఓగా సేవలందించి రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీపై వెళ్తున్న వంగరి శ్రీధర్‌ను తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు శనివారం డీపీఆర్‌ఓ కార్యాలయంలో మార్కండేయ మహర్షి మెమోంటోను బహూకరించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దుంప రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసి విశ్వనాథ్, కార్యవర్గ సభ్యుడు మోతుకూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

మల్హర్: తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను శనివారం సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక కాటారం డివిజన్ కన్వీనర్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రైతులు, విద్యార్థుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్‌ని కోరారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలకు భూ సంబంధిత సమస్యలను నేరుగా తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మండల కమిటీ ఎన్నిక

మహాముత్తారం: పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీని శనివారం మండలకేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుంపుల ప్రవీణ్‌రాజ్, ఉపాధ్యక్షులుగా జక్కుల అశోక్, ఆవుల శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. అదేవిధంగా ట్రెజరర్‌గా రామంచ సంపత్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా నూకల శివ శంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సరిగొమ్ముల సమ్మక్క, సరిగొమ్ముల రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలకు ఏవైఎస్ కమిటీ సభ్యులు శనివారం పరామర్శించి వారికి 25 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. పరామర్శించి వారిలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుర్రపు రాజేందర్, అశోక్, రవి, కిరణ్, యుగేందర్, తిరుపతి, రాజమౌళి, సునీల్, రాజేందర్, ప్రతాప్, చందర్, మహేష్ తదితరులు ఉన్నారు.

సమస్యలతో సతమతం

- ఏటూరునాగారంలో అడుగడుగునా భగీరథ లీకేజీలు
- అసంపూర్తిగా కాల్వల నిర్మాణం
- ఎక్కడి చెత్త అక్కడే
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఏటూరునాగారం సమస్యలతో సతమతం అవుతోంది. అడుగడుగునా చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలతో రోడన్నీ బురదగా, గోతులు పడుతున్నాయి. కాల్వల నిర్మాణం కొన్ని చోట్లా అసంపూర్తిగా ఉండగా మరికొన్ని కాల్వల్లోని ఎక్కడి చెత్తాచెదారం అక్కడే ఉంటూ దుర్వాసన వెదజల్లుతోంది. మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం వద్ద ఏడాది నుంచిపైపులైన్లు లీకేజీ అవుతున్నా గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అలాగే 6వ వార్డుల్లో ఉన్న కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీరు ఎటు వెళ్లలేక దుర్వాసన రావడంతోపాటు దోమల వృద్ధికి నిలయంగా మారుతున్నాయి. దీంతో దోమకాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఇంటి పన్నులు వసూళ్లు చేసేంత శ్రద్ధ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, సిబ్బందికి పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతి ఏడాది రూ.లక్షలాది ఖర్చు చేసి ప్రైవేటు కూలీలను పెట్టి ఖాతాల్లో నగదును కాజేయడం తప్ప కాల్వల్లో ఉన్న చెత్తను తొలగించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది కానీ సమస్యలను మాత్రం తీరడం లేదు. అంతే కాకుండా మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్విన సీసీరోడ్లను మళ్లీ పూడ్చివేయకుండా ఉండడంతో రోడ్ల గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నారు.



బురదగా మారిన సాయిబాబా దేవాలయం రోడ్డు



ప్రధానరోడ్డు వెంట అసంపూర్తిగా ఉన్న కాల్వ



కాల్వలో ఉన్న వ్యర్థాలు

వ్యర్థాలను తొలగించాలి



రామన్నగూడెం రోడ్డువెంట ఉన్న వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలగించాలి.

– జనగాం నర్సింగరావు

పదోన్నతి, బదిలీలు వెంటనే చేపట్టాలి

- ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్

ములుగు రూరల్ : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌టీయూ భవన్‌లో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ మాట్లాడుతూ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని, సమగ్ర శిక్షణ పరిధిలో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, కేజీబీవీ ఉద్యోగులకు, ఎంటీఎస్‌ను అమలు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బానోత్ విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు మూడ్ కసన్ సింగ్, బండారు జగదీష్, బంగారు నాయుడు, దాసరి రామ్మూర్తి, శ్రీనివాస్, విష్ణుమూర్తి, రామారావు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్

రోడ్డును చదును చేసిన అధికారులు

ఏటూరునాగారం : ఇసుక లారీలతో 163 జాతీయ రహదారి రైలు పట్టాల మాదిరిగా గోతులు ఏర్పడడంతో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామ సమీపంలో ఏర్పడిన గాడీలను జేసీబీతో అధికారులు చదును చేయించారు. మేడారం జాతర సమీపిస్తుండడంతో రోడ్డుపై ఏర్పడిన గాడీలను జేసీబీతో శనివారం చదును చేయడంతో ప్రమాదాల నుంచి ముప్పు తప్పినట్లయింది.



చిన్నబోయినపల్లి వద్ద రోడ్డును చదును చేస్తున్న జేసీబీ

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



వేదికపై విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంగపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పొదెం మేనక ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు స్వయంపాలనా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎంగా చెంచు వర్షిణి, కలెక్టర్‌గా భారతి, ఆర్‌జేడీగా శరణ్య, డీఈఓగా సాయిచరణ్, ఎంఈఓగా వైశాల వ్యవహరించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు మాట్లాడుతూ ఒకరోజు అధికారులుగా వ్యవహరించడం, విద్యాబోధన చేయడంతో వారి కి ఎదురైన అనుభవాలు వివరించారు. అనంతరం హెచ్ఎం మేనక విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నతస్థాయి ఉద్యోగాలు పొందాలని సూచించారు. చదువుకున్న పాఠశాలకు కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు విద్యాబోధన చేసిన గురువులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా జెడ్పీహెచ్‌ఎస్ కమలాపురం హెచ్ఎం శ్రీ నివాస్, తిమ్మంపేట నాగమణి, మంగపేట ఎంపీయూపీఎస్ సాంబశివరావు వ్యవహరించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు, ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయురాలు మేనక బహుమతులను అందచేశారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

కాటారం: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నర్సరీల పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని అన్ని గ్రామ పంచాయతీల నర్సరీల్లో షెడ్‌నెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వాటరింగ్ చేయాలని సూచించారు. ఉపాధిహామీ పనులకు అధిక సంఖ్యలో కూలీల హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దిడ్డి మోహన్‌రావు, బండారి చంద్రయ్య, నాయకులు ఆలేటి ఇంద్రారెడ్డి, లింగాచారి, కొర్నెబెల్లి శేషగిరి, ద్యాగల సలేందర్ సల్లూరి లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోవిందరావుపేట : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను మండలంలోని చల్వాయిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నాం పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్ణ కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, భూరెడ్డి మధు, బొల్లం ప్రసాద్, గూడూరు శ్రీనివాసరావు, చుక్క గట్టయ్య, సత్తు భద్రయ్య, రేండ్ల శ్రీనివాస్, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవ్, ఓదేలు, అయిలుమల్లు, రఘువీర్, కనకయ్య, శ్యామ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని కస్తూరిబాయి వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి గుండేటి రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా శ్రీధర్, సీనియర్ నాయకులు సమ్మయ్య, తిరుపతి, అర్జున్, ప్రవీణ్‌సుంకోజు ప్రశాంత్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శనివారం బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేల్పూరి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు గంపా రాంబాబు కట్ చేశారు. ఎదిరలో ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నర్సింహామూర్తి, మండల కార్యదర్శి పిల్లారిశెట్టి మురళి, ముడుంబ శ్రీనివాస్, నారాయణమ్మ, మాధురి, శివాజీ, నెహ్రూ, దామోదర్, ఆనంద్, శ్రీను, శాంతమూర్తి, తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో రోగులకు బీఆర్ఎస్ నాయకులు, ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డిలు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కూనూరు మహేష్, అశోక్ గౌడ్, సప్పిడి రామ్‌నర్సయ్య, రామ్మూర్తి, కాళ్ల రామకృష్ణ, చంద్రబాబు, కిరణ్, చిన్న పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి : కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న నాయకులు



గోవిందరావుపేట: కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపిస్తున్న పూర్ణ



మంగపేట: వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణ



వెంకటాపురం(కె) : కేక్ కట్ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఏటూరునాగారం: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం

రేగొండ(కొత్తపల్లిగోరి): ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైన ఘటన కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎంపీటీసీ సందెల స్వప్న తెలిపిన వివరాల ప్రకారం .. నిజాంపల్లికి చెందిన గుజ్జ రామారావుకు వ్యవసాయంతోపాటు పశువులు కూడా ఉన్నాయి. పశువుల మేత కోసం తన ఇంటి వద్ద ఖాళీ ప్రదేశంలో గడ్డివాము ఏర్పాటు చేశాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో అతడి ఇంటి పక్కన వ్యక్తి ఇంటి పరిసరాలను శుభ్రం చేసే క్రమంలో నిప్పు అంటించాడు. దీంతో గాలికి నిప్పు రవ్వలు ఎగిరిపడి మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. రూ.45వేలు పెట్టి కొన్న గడ్డి కాలిపోయిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
కానిస్టేబుల్ మృతి



కోటేశ్వరరావు (ఫైల్)

ములుగు రూరల్: ములుగు ఏరియా ఆస్పత్రి ఎదుట ఓ బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎస్పీ ఆఫీసులో ఇంటలిజెన్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోటేశ్వరరావు(40) శనివారం మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..విధుల్లో భాగంగా తన ఇంటి నుంచి కోటేశ్వరరావు బైక్‌పై బయలుదేరి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ములుగు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట సిగ్నల్ వద్ద ఆగి ఉన్న అతని బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ క్రమంలో అతను మృతి చెందాడు. దీంతో ఇతని స్వగ్రామమైన వాజేడు మండలం పెదగొల్లగూడెంలో విషాదం నెలకొంది.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం



మాట్లాడుతున్న సీడీపీఓ అవంతిక

రేగొండ: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందని సీడీపీఓ అవంతిక అన్నారు. మండలంలోని కొడవటంచ సెక్టార్ పరిధిలోని పోచంపల్లిలో శనివారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య శిక్షణ కార్యక్రమం సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతిక మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు ఎలా అందించాలి ఎందుకోసం అనే విషయాలపై సంపూర్ణంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల శారీరక మానసిక కండరాల అభివృద్ధి ఆలోచన శక్తి, జ్ఞాపకశక్తి పెంపొందించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలి అంటే పునాది గట్టిగా ఉంటే రేపటి తరం చక్కగా అన్ని రంగాలలో రాణిస్తారని ఆమె అన్నారు. మంచి అలవాట్లు, సంభాషణ, ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక కార్యక్రమాలు, సంసిద్ధత, సాంస్కృతిక కార్యక్రమాలు–శాస్త్రీయ పరిజ్ఞానం ఈ తొమ్మిది అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాత, సంధ్య, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

రేగొండ: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎంపీపీ పున్నం లక్ష్మి అన్నారు. మండలంలో దాదాపు మూడు సంవత్సరాలు ఎంపీడీఓగా విధులు నిర్వహించిన సురేందర్ బదిలీపై ఖమ్మం జిల్లాకు వెళ్తున్న సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై మాట్లాడుతూ ఉద్యోగం నిబద్ధతతో పనిచేసినప్పుడు ఆ వ్యక్తి ఉన్నత స్థానాలకు ఎదుగుతాడని అన్నారు. ఎక్కడ పని చేసినా ప్రజలకు మంచి సేవలు అందించి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ సురేందర్ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో తోటి ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల సహకారం మరువలేనిదన్నారు. అనంతరం ఎంపీడీఓను పూలమాల వేసి, శాలువతో సన్మానించారు.


నూతన ఎంపీడీఓకు సన్మానం

దామెర మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై రేగొండ మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్‌రావును శనివారం ఎంపీపీ పున్నం లక్ష్మి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్, ఏఓ వాసుదేవారెడ్డి, ఎంపీఓ రామ్‌ప్రసాద్, ఎంపీటీసీ ఐలి శ్రీధర్, నాయకులు పున్నం రవి, నీలాంబరం, సంతోష్, దేవేందర్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎంపీపీ పున్నం లక్ష్మి

జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం



మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా నోడల్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం ఆధ్వర్యంలో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు దేవరాజం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌ను చదువుతో చక్కగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. చదువు చెప్పిన అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, వ్యసనాలకు బానిస కూడదని సూచించారు.